# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 9, ఏప్రిల్ 2026


### అత్యవసర వైద్య సేవల విభాగం త్వరగా

## అందుబాటులోకి తేవాలి

●నిర్మల్ జిల్లా కలెక్టర్

**నిర్మల్, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**




జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న అత్యవసర వైద్య సేవల విభాగాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం చివరి దశలో ఉన్న భవనాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రి మ్యాపులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స గదులు, డయాలసిస్ కేంద్రం, ఐసీయూ, గైనిక్ విభాగం, ఫైర్ సేఫ్టీ తదితర విభాగాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. మిగిలి ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రిజిస్టర్లు, బ్లడ్ బ్యాంక్ రికార్డులను తనిఖీ చేశారు. గతంలో రక్తం పొందిన వారికి స్వయంగా ఫోన్ చేసి వివరాలను సరిపోల్చారు. రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ పేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ శారద, తహసీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు, పట్టణంలోని గుల్జార్ మార్కెట్ ప్రాంతంలో గల బస్తీ దవాఖానాను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు సేవా దృక్పథంతో చికిత్స అందించాలని, ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రాజేందర్, అధికారులు సౌమ్య, కౌన్సిలర్ తౌహిదుద్దీన్ పాల్గొన్నారు.

## ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలకు సమయం కేటాయించాలి



✪ మంచిర్యాల జిల్లా

కలెక్టర్ కుమార్ దీపక్

**హాజీపూర్, ఏప్రిల్ 08,ప్రభాతవార్త**

వైద్య వృత్తి సవాళ్లతో కూడుకుందని, ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలకు కొంత సమయం కేటాయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా యువజన క్రీడా సేవల అధికారి హనుమంత రెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సులేమాన్ లతో కలిసి వైద్య విద్యార్థుల కొరకు క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఈ నేపథ్యంలో ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతినిత్యం క్రీడలకు కొంత సమయం కేటాయించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల కొరకు ప్రభుత్వం 3 బస్సులను ఏర్పాటు చేసిందని, వైద్య విద్యార్థుల క్షేత్ర పర్యటనలు, ప్రాథమిక, సామాజిక ఆసుపత్రుల సందర్శన, ఇంటర్న్ షిప్ కొరకు ఈ బస్సులు ఉపయోగపడతాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 సం.ల నుంచి 15 సం.ల వరకు ఉపయోగంలో ఉంటాయని తెలిపారు. వైద్య విద్యార్థులు ప్రత్యేక విభాగాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కొరకు వచ్చే విద్యాసంవత్సరం మిగతా 2లో..

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

* కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**




జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆసుపత్రి పర్యవేక్షకులు డా. ప్రవీణ్ కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. సుబోద్ కుమార్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి నుండి ప్రభుత్వ ఆసుపత్రిగా మార్చి, 50 పడకల నుండి 330 పడకలకు ఆసుపత్రి సామర్థ్యాన్ని పెంపొందించడం జరిగిందని, దీనికి అనుగుణంగా సిబ్బంది నియామకం, వైద్య పరికరాలను సమాకూర్చాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య నిపుణులను నియమించి వైద్య సేవలు అందిస్తే తద్వారా ఆసుపత్రికి వచ్చే ప్రజల సంఖ్య పెరిగుతుందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆసుపత్రికి వచ్చే నిధులతో అత్యవసర మందులు, ఆక్సిజన్, ఇతర పరికరాల కొనుగోలుకు చేయాలని, ఇతర అవసరాలకు కావలసిన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఖాళీ స్థలన్ని పార్కింగ్ కొరకు కేటాయించాలని, ఆసుపత్రి ఆవరణలోని ప్రాంతాన్ని ప్రైవేట్ మెడికల్ షాప్ జిరాక్స్, క్యాంటీన్, ఇతరత్రా ఏర్పాటు చేసుకునేందుకు నిబంధనల ప్రకారం అనుమతించాలని, తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించాలని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన మార్చురీ వ్యాన్, అంబులెన్స్ కొరకు, మిగతా 2లో..


### పెండింగ్ పనులు

## త్వరితగతిన పూర్తి చేయాలి

❊ సీపీ అంబర్ కిషోర్ ఝా ❊ కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ నూతన భవనం పనుల పరిశీలన

**బెల్లంపల్లి, ఏప్రిల్ 08, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభోత్సవం నేపథ్యంలో నిర్మాణ పనులను సీపీ అంబర్ కిషోర్ ఝా బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమం సజావుగా మిగతా 2లో..



## గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

■ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, ఏప్రిల్ 08,ప్రభాతవార్త**

ఉట్నూర్ మండలం సర్పంచులతో ముఖ్య సమావేశం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరగగా, నూతన సర్పంచులకు గ్రామాల అబివృద్ధి కొరకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల దిశ నిర్దేశం చేశారు. వేసవిలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి లేకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులతో కలిసి సమస్య పరిష్కరించుకోవాలి అన్నారు. అవసరం ఉన్న చోట బోర్వెల్స్ శాంక్షన్ చేస్తా అన్నారు, ప్రతి గ్రామంలో చదువుకున్న యువతను గుర్తించి బూత్ లెవెల్ ఏజెంట్లుగా నియమించుకోవాలి, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని, సంక్షేమ పథకాలను గ్రామ సభల్లో ప్రజలకు వివరించాలి. సర్పంచ్‌ల రాజకీయ లక్షం గొప్పగా ఉండి,నిత్యం ప్రజా సేవలో ఉన్నవారు మంచి నాయకుడిగా పెద్ద స్థాయికి ఎదుగుతారు, ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న బిజెపి, బిఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టాలి. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. గ్రామ అబివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు ఆత్రం తిరుపతి, సర్పంచ్‌లు ఆనంద్ రావు, హరి నాయక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలకు సమయం కేటాయించాలి

(మొదటిపేజీ తరువాయి)

నుంచి తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వైద్య విద్యార్థులు క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం ద్వారా తమ ఒత్తిడి నుండి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆకాంక్ష మేరకు ప్రభుత్వం క్రీడా సామాగ్రిని కేటాయించిందని, విద్యార్థులు వైద్య విద్యతో పాటు క్రీడలు, ఇతర సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలని, విద్యపై మరింత ఏకాగ్రత పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నందున అవసరమైన ఆపరేషన్ థియేటర్, పరికరాలు, సిబ్బంది నియామకం కొరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు కమిటీ సభ్యులు ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు సమయానికి పూర్తి చేసి, ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, తాండూర్ సీఐ దేవయ్య, బెల్లంపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్ష పదవికి కె.శివకుమార్ రాజీనామా

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త



బీజేపీ కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు కె.శివకుమార్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన తెలిపారు. తాను గతంలో భారత సైన్యంలో సేవలందించిన అనంతరం పంచాయతీ సెక్రటరీగా పనిచేసినట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరుగుతూ పడుతున్న ఇబ్బందులు తనను ప్రభావితం చేశాయని తెలిపారు. అన్ని రంగాల్లో నాయకుల ఆధిపత్యం పెరగడం చూసి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఏ వ్యక్తిగత లాభం ఆశించకుండా సేవా భావంతో, సిద్ధాంతం మరియు హిందూ ధర్మంపై నమ్మకంతో భారతీయ జనతా పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై నమ్మకంతో పట్టణ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిందని, వాటిని తన శక్తివంచన లేకుండా క్రమశిక్షణతో నిర్వహించినట్లు పేర్కొన్నారు. తన బాధ్యత కాలంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, కార్యకర్తల అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. ఎన్నికల సమయంలో ఎదురైన ఒత్తిడులు, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొన్నానని తెలిపారు. అయితే, కొన్ని అనివార్య కారణాలు, సంస్థాగత లోపాల కారణంగా ప్రస్తుతం పట్టణ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వంలో కొనసాగుతూ, దేశం, ధర్మం కోసం తన చివరి శ్వాస వరకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తనకు సహకరించిన జిల్లా నాయకత్వం, కార్యకర్తలు, కాగజ్‌నగర్ పట్టణ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వేసవి సెలవుల్లో దొంగతనాలపై బెల్లంపల్లి పోలీసుల బహిరంగ హెచ్చరిక

- బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు

బెల్లంపల్లి, ఏప్రిల్ 08, ప్రభాతవార్త



వేసవి సెలవులు సమీపిస్తున్న నేపథ్యంలో బెల్లంపల్లి పట్టణంలో దొంగతనాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కాలంలో చైన్ స్నాచింగ్ ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయని, ముఖ్యంగా పెద్దపల్లి మరియు లక్సెట్టిపేట్ ప్రాంతాల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బెల్లంపల్లి ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పట్టణంలో రైల్వే స్టేషన్ ఉండటం వల్ల ఇతర ప్రాంతాల నుంచి అనుమానితులు వచ్చే అవకాశం కూడా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల భద్రత కోసం పోలీసులు పలు సూచనలు జారీ చేశారు. వేసవి సెలవుల సమయంలో చాలామంది కుటుంబాలతో కలిసి స్వగ్రామాలకు లేదా పర్యటనలకు వెళ్తుంటారు. ఇటీవల కాలంలో బంగారు ఆభరణాల దొంగతనాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. అందువల్ల విలువైన నగలు, నగదు వంటి వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. ఇళ్లకు బలమైన తాళాలు వేసి వెళ్లాలి. తాళం వేసినట్లు బయటకు స్పష్టంగా కనిపించకుండా కర్టెన్లు లేదా ఇతర ఏర్పాట్లు చేయాలి. రాత్రి సమయంలో ఇంట్లో ఎవరైనా ఉన్నట్లు భావించేలా లైట్లు వెలిగేలా ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి నుండి కొన్ని రోజులు దూరంగా ఉండే ముందు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే, ఆ ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేకంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి దొంగతనాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటారు. ఇంటి చుట్టుపక్కల లేదా కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రజల సహకారం ఉంటేనే నేరాలను పూర్తిగా అరికట్టగలమని, ఏదైనా అనుమానాస్పద ఘటన గమనించినా లేదా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని సీఐ శ్రీనివాసరావు పోలీసు సిబ్బందితో కలిసి ఆటో మైక్ సిస్టమ్ ద్వారా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు స్పష్టంగా వివరించారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, కానీ అప్రమత్తంగా ఉండటం ద్వారా మాత్రమే దొంగతనాలను నివారించగలమని పోలీసులు తెలిపారు.

# మంచి నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నాం

జన్నారం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త



విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నాం అని ధర్మారం ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంబడి సత్తన్న అన్నారు. బుధవారం నాడు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన గ్రామ సర్పంచ్, గ్రామ కమిటీ, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎంబడి సత్తన్న మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి నడవడికను కూడా నేర్పుతున్నామని తెలిపారు. దీనికి నిదర్శనం విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలు తెలియచేస్తున్నాయని అన్నారు. అలాగే ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ లను అందిస్తే బాగుంటుందని, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట 2026-27 విద్యా సంవత్సరంలో భాగంగా అందరూ పాల్గొని విద్యార్థుల నమోదు పెంచాలని సూచించారు. మన పాఠశాలలో మంచి విద్యాబోధన జరుగుతుందని దానికి మన విద్యార్థులు సాధించిన గురుకుల ప్రవేశాలే నిదర్శనమని అన్నారు. అదేవిధంగా సర్పంచ్, కమిటీ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల గ్రౌండ్ కోసం వెనుక భాగంలో మొరం పోయిస్తానని, విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ లు అందించడానికి తనవంతు సాయం చేస్తామని, పాఠశాలలో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. బడిబాటలో పూర్తి సహకారం అందించి విద్యార్థుల నమోదు పెంచడానికి బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆత్రం గోదావరి, ఉప సర్పంచ్ దుర్గం మహేందర్, పంచాయతీ కార్యదర్శి జలంధర్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద యువతి వివాహానికి జనహిత సేవా సమితి ఆర్థిక సహాయం

బెల్లంపల్లి, ఏప్రిల్ 08, ప్రభాతవార్త



హనుమాన్ బస్తీకి చెందిన నిరుపేద యువతి ఆకిరెడ్డి అనూష వివాహానికి జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ. 6,025 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు అడెపు సతీష్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు లేని నిరుపేద యువతి వివాహానికి సహాయం చేయడానికి ముందుకు వచ్చిన దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి, గౌరవ సలహాదారులు సింగతి తిరుమల్, నాయకులు పోలు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పన్నాల సదానందం, వేల్పుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




## వింధ్య పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**సారంగాపూర్, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని వింధ్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నవీన్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత స్థాయి విద్యను అభ్యసించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రమేష్ చేతుల మీదుగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ శ్రీనివాస్, సాయినాథ్, శ్రీనివాస్ గౌడ్, భారతి, సుమన్య, శ్రీలత, లావణ్య, పల్లవి, మంజుల, స్రవంతి, సులోచన, సంధ్యారాణి, గౌతమి, సోని, దివ్య, హారిక, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

## పోలీసుల తనిఖీలలో ఇసుక అక్రమ రవాణా పట్టివేత

**సారంగాపూర్, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

మండలంలోని జాం గ్రామ శివారులో బుధవారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ట్రాక్టర్‌ను సారంగాపూర్ తహసీల్దార్‌కు అప్పగించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తి జాం గ్రామానికి చెందిన నవత్ గణేష్‌గా పోలీసులు గుర్తించారు. నిబంధనలు అతిక్రమించి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దేగాంలో ముగిసిన అఖండ హరినామ సప్తాహ వేడుకలు

**భైంసా, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

మండలంలోని దేగాం గ్రామంలో గల శ్రీ సాయిబాబా మందిరంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ వేడుకలు బుధవారం ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా కాగడా హారతులతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. గత 11 ఏళ్లుగా గ్రామస్తులందరూ ఐకమత్యంతో ఈ సప్తాహను నిర్వహిస్తున్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడానికి, భక్తి మార్గంలో నడవడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. సప్తాహ జరిగినన్ని రోజులు భక్తులు ఉదయం, సాయంత్రం వేళల్లో భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర గ్రంథాల పారాయణం చేస్తూ భక్తులకు వాటి సారాంశాన్ని వివరించారు. ఈ శోభాయాత్రలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాంప్రదాయబద్ధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో

# మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం

**- అత్యవసరంగా త్రాగు నీరు ఏర్పాటు చేస్తాం - క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి మంత్రి సహాయ, సహకారాలు అందజేయాలి - చైర్‌పర్సన్ గోడిశెల సంధ్యారాణి**

**క్యాతన్‌పల్లి,ఏప్రిల్ 08, ప్రభాతవార్త**

క్యాతనపల్లి మున్సిపాలిటీలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌలిక వసతుల కల్పనకు నూతనంగా ఏర్పడిన పాలక వర్గం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గోడిశెల సంధ్యారాణి అన్నారు. బుధవారం వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ అధికారులతో కలిసి స్థానిక డబుల్ బెడ్ రూమ్‌లను పరిశీలించి, అందులో నివాసం ఉంటున్న కుటుంబాలను కలిసి వారి సమస్యలను తెలుసుకోన్నారు. ప్రధానంగా త్రాగు నీటి సమస్యను అత్యవసర సమస్య గా గుర్తించామని సింగరేణి యాజమాన్యం సహాయం తో పరిష్కరిస్తామని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిధిలోని పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి కాకముందే కనీస సౌకర్యాలు కల్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల లబ్ధిదారులకు అందజేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 231 ఇండ్లు ఇవ్వగా ఇప్పటికీ అందులో ఎటువంటి సౌకర్యాలు లేక కేవలం 10 కుటుంబాలు మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివాసం ఉంటున్నారని విమర్శించారు.




విద్యుత్, నీటి సౌకర్యం కల్పిస్తే లబ్ధిదారులు తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో సంతోషంగా జీవిస్తారని అన్నారు. వెంటనే డబుల్ బెడ్ రూమ్ పరిసరాలను శుభ్రపరిచి బాధితులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీ అభివృద్ధికై ప్రభుత్వ సహాయం కోరతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కౌడగొని సాంబయ్య , జుంజుపల్లి శశి కుమార్, మద్దెల శంకర్, ముని, వెనంక శ్రీనివాస్, బొమ్మ భూమయ్య గౌడ్, జక్కనబోయిన మంజుల, కొప్పి రాజశేఖర్, ఆర్నె సంధ్య, గండమాల కృపానందం, రంగ లక్ష్మీ, బబ్బెర స్వర్ణలత, బి.ఆర్.ఎస్ చెన్నూరు నియోజక వర్గ నాయకులు డాక్టర్ రాజా రమేష్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు రామిడి కుమార్,జాడి శ్రీనివాస్ సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, రెవెల్లి ఓదెలు, జిలకర మహేష్, అనిల్ రావు, యూత్ నాయకులు ఆర్నె సతీష్, రామిడి లక్ష్మీకాంత్, మణి, శివ, దేవి సాయి కృష్ణ పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ చేసే అభివృద్ధిని చూసి పార్టీలో చేరికలు

**- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**- ఎమ్మెల్యే సమక్షంలో జన్నారం కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు**

**జన్నారం, ఏప్రిల్ 08, ప్రభాతవార్త**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చెసే అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జన్నారం మండలం తొమ్మిది గుడిసెల పల్లెకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు నిర్మల్ జిల్లా అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో ఉట్నూర్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పిఎసిఎస్ మాజీ చైర్మన్ అల్లం రవి, మాజీ సర్పంచ్ అల్లం వెంకటరాజం, ఎంపీటీసీ కానగంటి రాజన్న, కోడి. ప్రభాకర్ ఆధ్వర్యంలో, పెరిక సంఘం జన్నారం మండల అధ్యక్షులు కానుగంటి శివలింగు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పార్టీ కండువా కప్పి కొత్తగా చేరిన వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో మామిడి శెట్టి విలాస్, ఉప సర్పంచ్, మామిడిశెట్టి మోనిక, వార్డు సభ్యులు, మగ్గుడి సురవ్వ, వార్డు సభ్యులు, కోడి పుష్పలత-ఏషు వార్డు సభ్యులు, రడపక నరేష్ వార్డు సభ్యులు, తీగుట్ల లింగన్న, మగ్గిడి రమేష్, పంచేర్పుల మహేష్, పంచేర్పుల రాజేష్, పంచేర్పుల రవి, కొట్టే తిరుపతి, తోకల రాజన్న, మామిడిశెట్టి పుల్లయ్య, సబ్బు నర్సయ్య, ముత్తె రవి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చేరిన కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చి పార్టీలో చేరామని, మా బాధ్యతగా ప్రజల అభివృద్ధి కి భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాం: మేయర్ ధర్ని మధుకర్

**- మంచిర్యాల 34వ డివిజన్‌లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు.. క్షేత్రస్థాయిలో మేయర్ పర్యవేక్షణ**

**నస్పూర్, ఏప్రిల్ 08, ప్రభాతవార్త**

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ అన్నారు. మంచిర్యాల శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత కార్యక్రమంలో భాగంగా బుధవారం 34వ డివిజన్‌లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పేరుకుపోయిన చెత్త తొలగింపు, వీధి దీపాల ఏర్పాటు, మంచినీటి సరఫరా, సీసీ రోడ్ల మరమ్మతులు వేగవంతం చేసినట్లు వివరించారు. 34వ డివిజన్ సింగరేణి ప్రాంతం అయినప్పటికీ మున్సిపల్, సింగరేణి అధికారుల సమన్వయంతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని మధుకర్ పేర్కొన్నారు. ప్రజలు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపల్, సింగరేణి చెత్త తరలింపు వాహనాలను ఉపయోగించాలని సూచించారు. డివిజన్ అభివృద్ధికి స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. పర్యటనలో భాగంగా ఆయన స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారం కోసం సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, 34వ డివిజన్ కార్పొరేటర్ అగ్గు సాగర్, 33వ డివిజన్ కార్పొరేటర్ ఎంబడి కుమారస్వామి, 26వ డివిజన్ కార్పొరేటర్ ఇరగదుండ్ల రవి, 30వ డివిజన్ కార్పొరేటర్ కర్రె శ్రీనివాస్, మున్సిపల్, సింగరేణి అధికారులు, సిబ్బంది, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న మేయర్ దర్ని మధుకర్, ఇతర ప్రజా ప్రతినిధులు

# అందరికీ సమాన హక్కులు కల్పించిన మహనీయుడు అంబేద్కర్

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

నస్పూర్, ఏప్రిల్ 08, ప్రభాతవార్త

అందరికీ సమాన హక్కులు కల్పించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏరియా జీఎం కార్యాలయంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకల సన్నాహక సమావేశం జరిగింది. ఈ నెల 14న బాబాసాహెబ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించింది. వెనుకబడిన, బహుజన వర్గాల వారు ఉన్నత విద్యా ఉద్యోగ అవకాశాలు పొందేలా అంబేద్కర్ మార్గం సుగమం చేశారని కొనియాడారు. వేడుకల నిర్వహణ కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించినట్లు జీఎం వెల్లడించారు. ఇదే విధంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను సైతం ఘనంగా నిర్వహించనున్నారు. ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ అధ్యక్షతన పూలే వేడుకల సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రమణా రావు, డీజీఎం పర్సనల్ ఎస్. అనిల్ కుమార్, ఎస్సీ లైజన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్, సీనియర్ పీఓ సురేందర్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ సమావేశంలో, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



జయంతి వేడుకల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్



## మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని కలిసిన తురటి గ్రామస్తులు

భైంసా, ఏప్రిల్ 08, ప్రభాతవార్త

ముధోల్ మాజీ శాసనసభ్యులు జి.విఠల్ రెడ్డిని భైంసా పట్టణంలోని దేగాం గ్రామంలో గల ఆయన నివాసంలో నర్సాపూర్ (జి) మండలంలోని తురటి గ్రామస్తులు కలిశారు. గ్రామంలో శివాలయ నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు. గ్రామస్తుల విన్నపంపై సానుకూలంగా స్పందించిన మాజీ ఎమ్మెల్యే, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తురటి గ్రామానికి చెందిన దత్తురామ్ అనే లబ్ధిదారునికి మంజూరైన సుమారు 25 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును విఠల్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌర శ్యాంసుందర్, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్, రాజేందర్, రమణ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు ఎడిపల్లి రాజేశ్వర్, మధు, కోమటి ముత్యం, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత

చెన్నూరు, ఏప్రిల్ 08, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని సుద్దాల జడ్పీ హైస్కూల్ విధ్యార్థులకు వి సర్వ్ సొసైటీ, బ్రెయినెక్షు అకాడమీ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.నర్సయ్య చేతులమీదుగా పరీక్ష సామాగ్రి అందజేసినట్లు ఫౌండర్, ఉపాధ్యాయుడు మేకల రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, ముకుం తిరుపతి, కొల్లూరి రవి, భాగ్యలక్ష్మి, భాగ్యరేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి 15వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన

**- సమస్యలను వివరించిన కౌన్సిలర్ చింతల వసంత**

బెల్లంపల్లి, ఏప్రిల్ 08, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలోని 15వ వార్డు టేకుల బస్తిలో మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో సంవత్సరాలుగా కొనసాగుతున్న సమస్యలను కౌన్సిలర్ చింతల వసంత కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వార్డులో డ్రైనేజీ పూడిక తొలగించాలని, స్లమ్ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌ను తొలగించాలని, ప్రతి వీధిలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే అన్ని గల్లీల్లో మురికికాలువలు నిర్మించాలని, అవసరమైన చోట విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని వీధుల్లో మున్సిపల్ నీటి పైప్‌లైన్లు లేకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పైప్‌లైన్లు వేసి ఇంటింటికి నల్లా కనెక్షన్లు కల్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి వార్డులో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ తొలగింపు విషయంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 15వ వార్డు అభివృద్ధి కోసం నిధుల మంజూరుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలు చెత్తను మున్సిపల్ ఆటో ట్రాలీలోనే వేయాలని, రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మున్సిపాలిటీకి ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, శానిటరీ సిబ్బంది ఇంద్రపాల్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్లు ఎన్నిక

లక్షెట్టిపేట, ఏప్రిల్ 08, ప్రభాతవార్త

లక్షేటిపేట మున్సిపాలిటీలోని స్థానిక విశ్రాంతి భవనం ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నలుగురు కో ఆప్షన్ సభ్యుల పేర్లను కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఎంపిక ప్రక్రియ మంచిర్యాల శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు జరిగిందని అన్నారు. కో ఆప్షన్ సభ్యుల ఎంపికకు 15 నామినేషన్లు రాగా అందులో నుండి నలుగురికి మాత్రమే అవకాశం దక్కింది. మునిసిపాలిటీలోని 14వ వార్డు మాజీ కౌన్సిలర్ చింత సువర్ణ అశోక్ కుమార్, ముస్లిం మైనారిటీకి చెందిన సయ్యద్ తైసిన్ హాజీ,తోగిటి నరసింహ చారి, క్రిస్టియన్ మైనారిటీ చెందిన నక్క జాకబ్ ల పేర్లను ప్రకటించారు. పార్టీలో కొనసాగుతూ, పార్టీని నమ్ముకుని, పార్టీకి సేవలు చేసిన వారిని అధిష్టానం ఎప్పుడూ మర్చిపోదని అలాంటి వారికి ఏదో రూపంలో సహాయ సహకారాలు అందుతాయని తెలిపారు. మున్సిపాలిటీలో గతంలో ఎప్పుడూ లేని విధంగా క్రిస్టియన్ మైనారిటీ కి అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయమని వారు అన్నారు. మంచిర్యాల నియోజకవర్గానికి ఎమ్మెల్యే గా కొక్కిరాలపై దొరకడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టమని, వారు నియోజకవర్గానికి చేస్తున్న సేవలు అనితర సాధ్యమని తెలిపారు.మొన్న జరిగిన పిప్పిరి మహాసభలో తెలంగాణలో రెండవ అన్నవరంలో పిలవబడే గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధికి 75 కోట్లు నిధులు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు దక్కుతుంది అని అన్నారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ చేర్మెన్ దొంత అంజలి నర్సయ్య వైస్ చెర్మన్ రాజేశ్వరి వెంకటస్వామి గౌడ్, మిగిత వార్డ్ కౌన్సలర్లు , మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం మాజీ జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్, జిల్లా స్పోక్ పర్సన్ బియ్యల తిరుపతి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు బాసట: ఎమ్మెల్యే

భైంసా, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన ధ్యేయమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎస్.ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నియోజకవర్గానికి చెందిన 144 మంది లబ్ధిదారులకు 35 లక్షల 50 వేల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఇప్పటివరకు సుమారు 4 వేల మందికి పైగా లబ్ధిదారులకు సహాయం అందజేశామని, మరో 400 మందికి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం ఎల్‌వోసీలు ఇప్పించామని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం తన నివాసంలో ప్రత్యేకంగా సీఎం సహాయనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యా, వైద్యం, సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇందులో భాగంగా 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మించనున్నట్లు తెలిపారు. బాసర ఆలయ అభివృద్ధికి 225 కోట్లు మంజూరు కావడం, ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం శుభపరిణామన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో పాటు 28వ ప్యాకేజీ పనులు పూర్తి చేసి తానూర్, కుభీర్, భైంసా మండలాలను సస్యశామలం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, సీనియర్ నాయకులు, బీజేపీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల పంపిణీ

జైనూర్, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:



అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరిచి, ప్రజలకు మరింత పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మొబైల్ ఫోన్లను అందజేస్తోందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుమేత విశ్వనాథరావు, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్ తెలిపారు. బుధవారం కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సీడీపీఓ ఇందిర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు ఆధునిక మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు సాంకేతికతను అందిపుచ్చుకుని కేంద్రాల నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. సీడీపీఓ ఇందిర మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పోషణ కార్యక్రమాలు, గ్రోత్ మానిటరింగ్, ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ వంటి కీలక సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈ మొబైల్స్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ యువ నాయకులు మెస్రం అంబాజీరావు, పంగిడి సర్పంచ్ ఆత్రం మీరా జాలింషా, వివిధ సెక్టార్ల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి., విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దు చేయాలని, వారి వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిసిపి మాట్లాడుతూ జిల్లాలో హాట్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని, నగర పరిధిలో వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





వినతిపత్రం అందజేస్తున్న మనీగూడ సర్పంచ్ జనా బాయి గణపత

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఏడీకి వినతి

**జైనూర్, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

జైనూర్ మండలంలోని మనీగూడ గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామ ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ ఏడీని కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం సర్పంచ్ జనా బాయి గణపత, ఉపసర్పంచ్ ఆత్రం భీమ్ రావు ఆధ్వర్యంలో అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలో ఎదురవుతున్న విద్యుత్ అంతరాయం, ఇతర సాంకేతిక సమస్యలపై చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



## పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ విద్యార్థుల ఎంపికలో పీచర పాఠశాల హవా

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ పరీక్షలో లక్ష్మణచాంద మండలంలోని పీచర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మండల వ్యాప్తంగా మొత్తం 40 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయగా, ఒక్క పీచర పాఠశాల నుండే అత్యధికంగా ఎనిమిది మంది ఎంపిక కావడం విశేషమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి శంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్, ప్రగతినగర్‌లోని ప్రగతి విద్యానికేతన్‌లో 6వ తరగతి నుండి పీజీ వరకు ఉచిత కార్పొరేట్ విద్యను అందిస్తారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ, తల్లి లేదా తండ్రి లేని పేద విద్యార్థులకు ఈ అవకాశం కల్పించిన పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ నిర్వాహకులకు టీఎస్ యూటీఎఫ్ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంటా అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు శ్రీదేవి, సునీత, శ్వేత, విజయలక్ష్మిలను వారు ప్రత్యేకంగా అభినందించారు.

## రాజ్యాంగ పరిరక్షణ కోసమే జై భీమ్ జ్ఞాన యాత్ర

**ఖానాపూర్, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

భారత రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యంగాజై భీమ్ జ్ఞాన యాత్ర నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ సంఘం నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ల రమేష్ తెలిపారు. కడెం మండలంలోని ధర్మజిపేట్ గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కల్పించేలా అద్భుతమైన రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. రాజ్యాంగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏప్రిల్ 1 నుండి 14 వరకు ఈ జ్ఞాన యాత్రను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను, ఆలోచనలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, మాజీ ఎంపీటీసీలు బొమ్మెన ఆనంద్, మేష నరసయ్య, శైలేందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.






సమావేశంలో పాల్గొన్న కాపు సంఘం నాయకులు

## ఈ నెల 21న మున్నూరుకాపు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :**

మున్నూరు కాపు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక ఈ నెల 21న మంగళవారం ఎన్నుకోవడం జరుగుతుందని జిల్లా హడ్ హాక్ కమిటీ సభ్యులు గాజుల జక్కయ్య, గడ్డల శంకర్ లు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కమిటీ ఎన్నికకు అన్ని మండలాల నుంచి మున్నూరుకాపులు హాజరు కావాలని అన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదరికి పోటీలో ఉన్నవారు ఉదయం వచ్చి పేరు నమోదు చేసుకోవాలన్నారు. మున్నూరు కాపులు ఐక్యమత్యతో ఉండి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమశేఖర్, సిర్పూర్ నియోజకవర్గం అధ్యక్షులు సుంకరి తిరుపతి, నాయకులు వెంకటేశ్వర్లు, తిరుపతి, మధుకర్, సురేష్, వెంకన్న, సదాశివ్, పోషన్న, ప్రభాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 20 లోపు విశ్రాంత ఉద్యోగులు జీవన ప్రమాణ పత్రం అందజేయాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులు, ఫ్యామిలి పెన్షనర్లు ఈ నెల 20 లోపు 202526 సంవత్సరానికి గాను జీవన ప్రమాణ పత్రం అందజేయాలని జిల్లా ఖజానా శాఖ అధికారి భానుమతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత మీ సేవ కేంద్రాల్లో గాని, ఐఎఫ్‌ఎమ్ఐఎస్ పెన్షనర్స్ ఆప్ ద్వారా గాని లేనియెడల నేరుగా జిల్లా ఖాజానా శాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. అదేవిధంగా 75 సంవత్సరాల పైబడిన పెన్షన్ దారులు నేరుగా జిల్లా ఖజానా శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో ఏప్రిల్ నెలకు సంబందించిన పెన్షన్ నిలిపివేయడం జరుగుతుందని అధికారి తెలిపారు.

## మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

### - ఘనంగా నిర్వహించుటకు జీఎం ఎన్. రాధాకృష్ణ ఆదేశాలు

**మందమర్రి, ఏప్రిల్ 08, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియాలో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం మందమర్రి జీఎం కార్యాలయంలో వేడుకల నిర్వహణ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న అధికారులతో ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. జీఎం మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యా ప్రోత్సాహానికి మహాత్మా జ్యోతిబా పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని జయంతి వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమీక్షా సమావేశంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) అశోక్, ఏరియా సివిల్ విభాగం ఎస్ఈ శ్రీధర్, కేకేఓసీ అడిషనల్ మేనేజర్ పి. శ్రీధర్ గౌడ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ రవి, ఏఐటీయూసీ జీఎం లెవల్ స్ట్రక్చర్ కమిటీ సభ్యులు రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వేదిక అలంకరణ, అతిథుల ఆహ్వానం, ఇతర ఏర్పాట్లపై చర్చించి సంబంధిత అధికారులకు జీఎం దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు.



# అధికారులు సమయపాలన పాటిస్తూ సేవలందించాలి

## - కలెక్టర్ కె.హరిత



**బెజ్జూర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలో బుధవారం జిల్లా కలెక్టర్ కె.హరిత ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, తహసిల్దార్ కార్యాలయం, గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలను సందర్శించారు. అన్నింటిలోనూ హాజరు పట్టికలను పరిశీలించి ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రజలతో స్నేహభావంతో వ్యవహరించాలని తెలిపారు. వేసవి అయినందున వడదెబ్బకు గురైన వారికి వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, గర్భిణులు ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, సౌకర్యాలు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. మండల పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులను అభ్యసించాలని ఆకాంక్షించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. స్థానిక ప్రజలు పలు సమస్యలను కలెక్టర్కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామ్మోహన్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



చిన్నారులకు యూనిఫాం దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కుమ్మరి రంజిత్ కుమార్

# అంగన్వాడీ పిల్లలకు దుస్తులు అందజేత

**ఖానాపూర్, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారి పిల్లలను తప్పనిసరిగా పంపించాలని సర్పంచ్ కుమ్మరి రంజిత్ కుమార్ తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం మండలంలోని లింగాపూర్ రెండవ అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ అధ్యక్షతన తల్లుల సమావేశం, ఏఎల్ఎంఎస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వం ద్వారా పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం, ఆటపాటల ద్వారా విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, వికాసం కోసం తల్లిదండ్రులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వం నుంచి మంజూరైన యూనిఫాం దుస్తులు, బాలమృతం ప్యాకెట్లు, గుడ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కమ్ముల లక్ష్మి, వార్డు సభ్యులు ముస్కు రాజేందర్ రెడ్డి, జీపీ సభ్యులు, వీవో లీడర్లు, అంగన్వాడీ టీచర్ మంగ శ్రీలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జనహిత అన్నపూర్ణ 5వ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం



**బెల్లంపల్లి, ఏప్రిల్ 08, ప్రభాతవార్త**

జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 400వ సారి అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచెందర్, టిపిసిసి జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ మాట్లాడుతూ, అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా నిరుపేదలు, బాటసారుల ఆకలి తీర్చేందుకు నిర్విరామంగా అన్నదానం నిర్వహించడం అభినందనీయం అన్నారు. అలాగే రక్తదాన శిబిరాలు, నేత్రదానం, అవయవ దానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనహిత సభ్యులను అభినందించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచెందర్ మాట్లాడుతూ, జనహిత సేవా సమితి చేపడుతున్న అన్నదాన కార్యక్రమాలు, నిత్య జనగణమన, రక్తదాన శిబిరాలు వంటి సేవలు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచిస్తూ తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. టిపిసిసి జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి మాట్లాడుతూ, జనహిత సేవా సమితి సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ, ఉగాది సందర్భంగా 2021 ఏప్రిల్ 13న ప్రారంభమైన జనహిత అన్నపూర్ణ కార్యక్రమం ప్రతి బుధవారం నిరంతరం కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు 400 సార్లు సుమారు రూ.27 లక్షల వ్యయంతో వేలాది మందికి అన్నదానం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అన్నదాతలు, శాశ్వత దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అన్నదాన కార్యక్రమం కోసం శాశ్వత స్థలం కేటాయించి కేంద్ర నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నిత్య జనగణమన కార్యక్రమంలో సేవలందిస్తున్న షఫీ, కొయ్యడ శంకర్ గౌడ్లతో పాటు వంట మాస్టర్ నిచ్చకోల గురుస్వామి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడెపు సతీష్లను శాలువాలతో సత్కరించి స్మారక చిహ్నాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ సింగ్, నాయకులు గెల్లి రమాకాంత్, హనుమాండ్ల మధుకర్, శాశ్వత అన్నదాతలు, జనహిత సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గూడెంగుట్ట ఆలయ పరిసరాల్లోని దుకాణాలను తనిఖీ చేస్తున్న పోలీసులు, అధికారులు

# గూడెంగుట్ట పరిసరాల్లో మద్యం, మాంసం విక్రయాలపై నిషేధం

## - నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**దండేపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**

దండేపల్లి మండలంలోని గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి ఆలయ పరిసరాల్లో మద్యం, మాంసాహార విక్రయాలపై అధికారులు బుధవారం కఠిన ఆంక్షలు విధించారు. క్షేత్రానికి ప్రతిరోజూ వందలాది మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతినకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. స్థానిక ఎస్సై తహిసోద్దీన్, ప్రభుత్వ అధికారులు కలిసి క్షేత్ర పరిసరాల్లోని దుకాణాలను స్వయంగా తనిఖీ చేసి నోటీసులు జారీ చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రం వద్ద నిబంధనలకు విరుద్ధంగా మాంసం, మద్యం విక్రయిస్తే సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ఆలయ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని దుకాణదారులకు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా సహకరించాలని కోరారు.

# మద్యానికి బానిసై వ్యక్తి మృతి

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 08, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాంద్రపు తిరుపతి (48) తన ఇంట్లో మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాలతో భార్య పిల్లల్ని తీసుకుని సంవత్సరం క్రితం వాళ్ళ తల్లి గారి ఇంటికి వెళ్ళిపోయింది. తిమ్మాపూర్లో మృతుడు తన తల్లితో పాటు ఇంట్లో ఉంటున్నాడు. భార్య వెళ్లిపోయిన నుంచి మద్యానికి బానిస అయ్యాడు ఈనెల 4వ తారీఖున తన తల్లి బంధువుల పెళ్ళికి వెళ్లగా మృతుడు ఇంట్లో మద్యం తాగి సమయానికి అన్నం లేక చనిపోయి ఉంటాడని తల్లి కాంద్రపు రామక్క ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుంది. మృతుడు సుమారు మూడు నాలుగు రోజుల క్రితం చనిపోయి ఉంటాడని మృతదేహం మొత్తం కుళ్ళిపోయి వాసన రావడంతో చుట్టుపక్కల వాళ్ళు తన తల్లి సమాచారం ఇవ్వడంతో మృతి విషయం తెలిసింది.

# రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు పొందిన 108 సిబ్బందికి ఘన సన్మానం

**జన్నారం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**



108 అంబులెన్స్ సిబ్బంది విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఈఎమ్‌టి కిషన్, పైలట్ రఫీక్ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. బుధవారం నాడు జన్నారం మండల కేంద్రంలో తహసీల్దార్ రామ్ మోహన్, ఎమ్‌పిడివో ఉమర్ షరీఫ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫసీ ఉల్లా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉత్తమ సేవలను అందించి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకోవడం చాలా గొప్ప విషయమని, ఎల్లప్పుడు ఇలాగే సేవలను అందించి అందరి మన్ననలు పొందాలని అన్నారు. అలాగే వారిని కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎం డి రియాజుద్దీన్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఎంఏ రజ్జాక్, పొనకల్ వార్డ్ మెంబర్ మోసిన్ షా ఖాన్, మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ సాధుపాష, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ షా, నాయకులు మోలానా నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## పనులు వేగవంతం చేసేందుకు ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

### - జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన పనులను వేగవంతం చేసేందుకు ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి బుచ్చన్న లతో కలిసి జిల్లాలోని ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో పనిచేసే ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని తెలిపారు. వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాలలోని కూలీలకు ఉపాధి కల్పించాలని, ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 100 మందికి పైగా కూలీలు పనిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా కూలీల హాజరును పక్కాగా నమోదు చేయాలని, ఎలాంటి అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో కూలీలను చైతన్యపరచి పనులు కల్పించడంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రగతి విద్యా నికేతన్‌కు 5 విద్యార్థుల ఎంపిక

**కెరమెరి ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**

ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో చుక్కా రామయ్య పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రగతి విద్యా నికేతన్ పాఠశాలకు మండలంలోని ఒక పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. ఈ ఎంపిక ప్రక్రియలో భాగంగా జిల్లాలోని పలు పాఠశాలల నుండి విద్యార్థులు పరీక్షలు రాసి పాల్గొన్నారు. అందులో ఎంపీపీ ఎస్ సావర్ ఖేడ పాఠశాలకు చెందిన ఎస్. మహేందర్, ఎం. గణేష్, జి. అభి, ఎం. మీనాక్షి, పి. కార్తిక్ అను విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రగతి విద్యా నికేతన్ పాఠశాలకు ఎంపికయ్యారు. జిల్లాలో మొత్తం 35 మంది విద్యార్థులు ఈ పాఠశాలకు ఎంపికైనట్లు సమాచారం. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఆడే ప్రకాష్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివితే మంచి అవకాశాలను సాధించవచ్చని ఆయన అన్నారు. ప్రగతి విద్యా నికేతన్ వంటి విద్యాసంస్థల్లో చదివే అవకాశం రావడం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మరింత కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాల, మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది యోగిత, శ్రీ లేఖ, లింగయ్య, ఈశ్వర్ శంకర బాయి నందిని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉట్నూర్‌లో ఘనంగా గోర్ బంజారా దినోత్సవ వేడుకలు

**ఉట్నూర్, ఏప్రిల్ 08, ప్రభాత వార్త :**

పట్టణంలోని సేవదాస్ నగర జగదాంబ దేవి ఆలయంలో బంజారా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో బంజారా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం కవి రాథోడ్ ప్రకాష్ దంపతులకు శాలువాలతో సన్మానించి గానా రత్న అవార్డు ను అందించి న్నా బంజారా రచయిత వేదిక కవులు. బుధవారం ప్రకాష్ మాట్లాడుతూ ప్రపంచంలో మనిషి పుటితే కీర్తి ప్రతిష్టలు, పేరు ను సంపాదించుకోవాలన్నారు. బంజారా కవులు బంజారా ప్రజలకు ముందు భవిష్యత్ కోరారు చైత్నన్య చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో బంజారా రచయిత వేదిక అధ్యక్షులు డాక్టర్ ఇందల సింగ్ బంజారా, ప్రధాన కార్యదర్శి జాదవ్ ధరమ్ సింగ్, గౌరవ అధ్యక్షులు జాదవ్ బంకట్ లాల్, ఉప అధ్యక్షులు జాదవ్ మురళి, కార్యదర్శి చవాన్ ప్రమేశ్వర్, జేపీ నాయక్, పీత నాయక్, గణేష్ మహారాజ్, జాదవ్ వసంత్ రావు, చావన్ సేవాదాస్, అంబాజీ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**

ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, షెడ్యూల్డ్ కులముల సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న పాఠశాల, వసతి గృహాన్ని సందర్శించి తరగతి గదులు, విద్యార్థుల గదులు, వంటశాల, భోజనశాల, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులు చేపట్టిందని, విద్యార్థులకు పూర్తి సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకోవాలని, ఆ దిశగా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ



ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుకను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని, ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, త్రాగునీరు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వేసవి అయినందున త్రాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జిగా ఆకారం రమేష్

### - ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా కృషిచేస్తా: రమేష్

**మందమర్రి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణానికి చెందిన డిసిసి కార్యదర్శి ఆకారం రమేష్ ను జైపూర్ మండల ఇంచార్జిగా నియమించడం జరిగింది. ఈ మేరకు డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆకారం రమేష్ మాట్లాడుతూ జైపూర్ లో కాంగ్రెస్ నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ మరింత బలోపేతం చేస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చేయడమే లక్ష్యంగా పని చేస్తానని, కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారికి, పార్టీ కోసం కష్టపడే వారికి కాంగ్రెస్ పార్టీ ఎప్పటికైనా న్యాయం చేస్తుందని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన మంత్రి వర్యులు, చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణకి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

### - జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

**నస్పూర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కొత్తరోడ్ ఏరియాలో శ్రీరాంపూర్ పోలీసులు ఆకస్మికంగా నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేసవి సెలవుల దృష్ట్యా ప్రజలు ఊర్లకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాళం వేసిన ఇళ్లలో విలువైన వస్తువులు ఉంచి వెళ్లవద్దని కోరారు. దొంగతనాల నివారణకు ప్రతి డివిజన్‌లో సీసీటీవీ కెమెరాలు అమర్చుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఏసీపీ కోరారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న ఒక వాహనదారుడిని ఆదర్శంగా గుర్తిస్తూ శాలువాతో సన్మానించారు. వాహనదారులు క్రమశిక్షణతో ప్రయాణించి ప్రాణాలను కాపాడుకోవాలని తెలిపారు. మైనర్ బాలురకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 20 వాహనాలకు జరిమానాలు విధించారు. కొత్తరోడ్ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పోలీసుల సూచనలను విన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఇన్స్‌పెక్టర్ అశోక్, ఎస్సై సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత మహాసభలకు ఐక్యంగా మద్దతు తెలపాలి

### - దళిత హక్కుల పోరాట సమితి పిలుపు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 08, ప్రభాతవార్త**

వరంగల్‌లో ఏప్రిల్ 17, 18 తేదీల్లో నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్ అధ్యక్షతన మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ అభయహస్తం పేరిట రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి దళితులను మోసం చేసిందని ఆరోపించారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడిచినా రాజ్యాంగం కల్పించిన హక్కులు పూర్తిగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో దళితులపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని విమర్శించారు. రాజ్యాంగబద్ధ సంస్థలను తమ ఆధీనంలోకి తెచ్చుకుని ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తుందని, రిజర్వేషన్ల అమలులో జాప్యం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ సామాజిక న్యాయాన్ని బలహీనపరుస్తోందని ఆరోపించారు. మతోన్మాద రాజకీయాలతో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని పేర్కొన్నారు. తక్షణమే కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేసి రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేయాలని, ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ, సామాజిక న్యాయం మరియు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని తెలిపారు. మహాసభల్లో దళితుల అభివృద్ధి, వారిపై జరుగుతున్న దాడులు, అసమానతలపై సమగ్ర చర్చ జరిపి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమోళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, డి.ఆర్. శ్రీధర్, గుండా చంద్ర మాణిక్యం, రత్నం రాజం, మేకల రాజేశం, కొంకుల రాజేష్ (ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు), గోమాస గంగారాం, బొల్లం సోనీ (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు) తదితరులు పాల్గొన్నారు.




# పెద్దవాగు రైల్వే బ్రిడ్జ్ పనుల్లో ప్రమాదం

## ✦ ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలు
## ✦ మరికొందరికి స్వల్పగాయాలు

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగు పై కొనసాగుతున్న మూడవ రైల్వే లైన్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల్లో బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. పనుల సమయంలో ఇనుప గడ్డర్ల మధ్య ఇరుక్కుని కాంట్రాక్ట్ కార్మికులు గాయపడిన ఘటన స్థానికంగా ఆందోళనకు గురి చేసింది. పనులు కొనసాగుతున్న సమయంలో అకస్మాత్తుగా భారీ ఇనుప గడ్డర్లు కదలడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు అప్రమత్తం కావడానికి ముందే ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రవి బసాక్ తీవ్రంగా గాయపడగా అతనిని ప్రస్తుతం మెరుగైన చికిత్స కోసం కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మరో కార్మికుడు కన్నయ్య (ఉత్తరప్రదేశ్) గాయపడి చికిత్స అనంతరం డిశ్చార్జ్ కావడం జరిగింది. ఇంకా ముగ్గురు కార్మికులు స్వల్ప గాయాలతో ప్రథమ చికిత్స పొందారు. కాగా ఈ ప్రమాదంపై స్థానిక ప్రజలు, కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పనుల సమయంలో సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నారు. కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు అందించకుండా పనులు చేయిస్తున్నారని, గుత్తేదారులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. హెల్మెట్లు, సేఫ్టీ బెల్టులు వంటి ప్రాథమిక రక్షణ చర్యలు కూడా సరిగా అమలు కాలేదని కార్మికులు చెబుతున్నారు. పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కూడా ప్రమాదానికి ప్రధాన కారణమైందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు సమయానికి పర్యవేక్షణ చేపట్టిఉంటే ప్రమాదాన్ని నివారించవచ్చని అభిప్రాయపడుతున్నారు. ప్రమాదం జరిగిన తరువాత మాత్రమే అధికారులు స్పందించడం పట్ల కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు పరిస్థితిని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని ప్రజలు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు గాయపడిన కార్మికులకు తగిన పరిహారం అందించాలని కోరుతున్నారు. ప్రమాదం నేపథ్యంలో బ్రిడ్జ్ నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షించిన తర్వాత మాత్రమే పనులు ప్రారంభించాలని స్థానికులు సూచిస్తున్నారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. కార్మికుల ప్రాణ భద్రతను ప్రాధాన్యంగా తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.



ఇనుప గడ్డర్ల మధ్య ఇరుక్కున్న కార్మికుడు



చికిత్స పొందున్న కార్మికుడు

# ఘనంగా వివేకవర్ధిని డిగ్రీ పీజీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

**✳ విద్యార్థులు మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు ✳ ఉదారి చంద్ర మోహన్ గౌడ్**

**మందమర్రి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**



విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న మంచిర్యాల జిల్లాలోనే ప్రముఖ విద్యాసంస్థ వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాల సిల్వర్ జూబ్లీ ఉత్సవ వేడుకల ఈవెంట్‌ను ఆట పాటలతో, డిజే స్టెప్పులతో, కేరింతల నడుమ సందడిగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని సాయిమిత్ర గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. విద్యార్థులు విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకొని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని, మనసుపెట్టి చదువుతే సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. అలాగే పోటీ ప్రపంచంలో విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే చదివిన చదువుకు సార్థకత ఉంటుందన్నారు. విద్యార్థుల లక్ష్య సాధనలో కళాశాల యాజమాన్యం నిరంతరం తోడ్పాటు అందిస్తుందని అన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చంద్రమోహన్ గౌడ్ ఉదారి మాట్లాడుతూ చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని భావించి గత 25 సంవత్సరాల క్రితం స్వర్గీయ గొనె హన్మంతరావు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉద్దేశ్యంతో స్థాపించబడిన విద్యా వ్యవస్థ, ఆయన ఆశయాలకు అనుగుణంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను మా కళాశాల అందిస్తుందని, విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించేవిధంగా ఉపాధ్యాయ బృందం తోడ్పాటు అందిస్తున్నామన్నారు. పట్టుదలతో చదివితే అద్భుత ఫలితాలు మీ సొంతం అవుతాయని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ సంస్కారవంతంగా పెద్దలపట్ల గౌరవం కలిగి లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతూ గంజాయి లాంటి చెడు అలవాట్లకు అలవాటు వడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు పునాది ఇంటర్మీడియట్, డిగ్రీ దశ అని, అధ్యాపకుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. యువత డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండి, తల్లిదండ్రుల కళలను సాకారం చేసే విధంగా ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించే దిశగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ని వెంటనే విడుదల చేసి బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఉండే విధంగా చూడాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు షరీనా, చైతన్య, శ్రీలేఖ, వంశీ, సతీష్, శ్రీనివాస్, రాజేష్, సమీర్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.